# సాక్షి తిరుపతి

శుక్రవారం : 24 : జనవరి : 2025






## ఆర్టీసీ ఉద్యోగుల ఆ'పరేషాన్'

స్థానికంగా ఉన్న ఆస్పత్రిలో శస్త్రచికిత్సలకు అనుమతి లేకపోవడంతో ఆర్టీసీ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - IIలో



## ప్రచారం ఘనం..

జిల్లాలో పశువుల షెడ్ల నిర్మాణం ఆరంభ శూరత్వంగా మారింది. నిధులు విడుదల కాకపోవడం విమర్శలకు తావిస్తోంది. - IIలో




## 505 మందికి వైద్యపరీక్షలు

శ్రీసిటీ పరిధిలోని చెరివి గ్రామంలో గురువారం 505 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. - IIలో

## న్యూస్‌రీల్

### నేడు ఎస్పీ బాధ్యతల స్వీకరణ


హర్షవర్ధన్, ఎస్పీ

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీగా హర్షవర్ధన్ రాజు శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈయన విజయవాడ హెడ్ క్వార్టర్ నుంచి ఇటీవల తిరుపతికి బదిలీ అయిన విషయం తెలిసిందే. గతంలో తిరుపతిలో ఎన్నికల సమయంలో పనిచేస్తూ కడపకు బదిలీ అయ్యారు. ఉన్న కొద్ది రోజుల్లోనే ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చి క్రైమ్ రేటింగ్ తగ్గించారు.

### గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెస్సీ(కంప్యూటర్ సైన్స్), ఎమ్మెస్సీ (ఐటీ, ఎంసీఏ, ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్ లేదా ఐటీ)లో 55 శాతం మార్కులు సాధించినవారు అర్హులని తెలిపారు. పీహెచ్‌డీ, యూజీసీ–నెట్, సెట్ ఉత్తీర్ణత సాధించిన వారికి ప్రధాన్యాత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి 1న ఉదయం 10 గంటలకు అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో కళాశాలకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9246990123 నంబరులో సంప్రదించాలని కోరారు.

### త్వరితగతిన సీసీ రోడ్ల నిర్మాణం


రాజులపాళెంలో మినీ గోకుల షెడ్డును పరిశీలిస్తున్న డ్వామా పీడీ

రేణిగుంట: ఉపాధి హామీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ ఆదేశించారు. ఏర్పేడు మండలం, రాజులపాళెంలో మినీ గోకులం, సీసీ రోడ్డు నిర్మాణాలను ఆయన గురువారం పరిశీలించారు. పశువులకు సురక్షితమైన ఆవాసం, దాణా తొట్టెలు, తాగునీటి, యూరినరీ టబ్ వంటి సౌకర్యాలు మినీ గోకులాల్లో ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఆయన పల్లం గ్రామంలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఏపీవోలు డీ.చంద్రశేఖర్‌రాజు, అవిలాల దేవరి, మండల ఇంజినీర్ బీ.రవితేజ, టెక్నికల్ అసిస్టెంట్ శాలి మనోహర్, జూనియర్ ఇంజినీర్ పంజాడ బాలాజీరావ్ పాల్గొన్నారు.

### శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 62,223 మంది స్వామివారిని దర్శించుకోగా.. 19,704 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.10 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

### వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ రామకృష్ణ

తిరుపతి క్రైం: నగరంలో పలుచోట్ల గురువారం ఉదయం పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. ఈస్ట్ సీఐ రామకృష్ణ బృందం రేణిగుంట రోడ్‌లోని హీరో హోండా షోరూం వద్ద వచ్చే వాహనాలన్నిటినీ క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీలు నిరంతరం చేస్తామని సీఐ చెప్పారు.

### ఎట్టకేలకు ఆర్టీసీ దుకాణాలకు టెండర్లు

తిరుపతి అర్బన్: జిల్లాలోని పలు డిపోల పరిధిలో ఖాళీగా ఉన్న 77 దుకాణాలను భర్తీ చేయడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి(డీపీటీవో) నరసింహులు గురువారం తెలిపారు. ఈ నెల 30వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట వరకు దరఖాస్తులను ఆయా డిపోల పరిధిలో అందుబాటులలో ఉంటాయని చెప్పారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల లోపు తిరుపతిలోని డీపీటీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెండర్ల బాక్స్‌లో దరఖాస్తులు వేయాలని తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు ఓపెన్ చేయడంతోపాటు ఖరారు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## సై'ఖ'తం'



శ్రీకాళహస్తి నియోజకవర్గం, రేణిగుంట మండలం, గాజులమండ్యం సమీపంలోని స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న ప్రైవేట్ భూముల్లో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. బావులను తలపించేలా ఇసుక తవ్వేస్తున్నారు. ఇందులో టీడీపీ నాయకులే ఉండడంతో స్థానిక అధికారులు తమకెందుకులే అని మిన్నకుండిపోతున్నారు. ఇదే అదునుగా కూటమి నేతలు రాత్రి పగలు తేడాలేకుండా ట్రాక్టర్లు పెట్టి ఇష్టారాజ్యంగా తరలించి జేబులు నింపుకుంటున్నారు. – శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట)

## ఆరోగ్య 'యోగ'ం



ఆరోగ్య ప్రధాయని యోగా అని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు తెలిపారు. తిరుపతి వివేకానంద కేంద్రం, ఎస్వీయూ సంయుక్త అధ్వర్యంలో గురువారం ఎన్టీఆర్ స్టేడియంలో సామూహిక సూర్యనమస్కార్–2025 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పది వేల మందితో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు వెల్లడించారు. కన్యాకుమారి వివేకానంద కేంద్ర వైస్ ప్రెసిడెంట్ హనుమంతరావు, వేదిక్, సంస్కృత వర్సిటీల వీసీలు రాణీసదాశివమూర్తి, జీఎస్ఆర్ కృష్ణమూర్తి, మంత్రమహేశ్వరి శక్తి పీఠాధిపతి రమ్యానంద సరస్వతి స్వామి, చెరుకూరి వెంకటేశ్వర్ ప్రసాద్, శ్యాప్ చైర్మన్ రవినాయుడు పాల్గొన్నారు. – తిరుపతి సిటీ

# దాదాగిరి!

సిలికా, మైన్స్ డీలర్లే లక్ష్యంగా గుడూరులోని అధికార పార్టీ నేత చెలరేగిపోతున్నారు. అధికారులు అనుమతులిచ్చినా తనకు కమీషన్ ఇవ్వాల్సిందేనని దాదాగిరికి దిగుతున్నారు. లేదంటే ఒక్క లారీ కూడా ముందుకు కదలదని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దీంతో చేసేది లేక ఆ నేత ఇంటి చుట్టూ డీలర్లు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇంతకీ ఆ దాదాగిరీ కథా కమామీషు ఏంటో మీరే చదవండి..


నిల్వ ఉన్న సిలికా

### అనుమతులిచ్చినా కమీషన్ ఇవ్వాల్సిందే!

- సిలికా డీలర్లపై టీడీపీ నేత హుకుం
- ఇప్పటికే నష్టపోయాం.. విక్రయించాక ఇస్తామన్న డీలర్లు
- కుదరదంటున్న గూడూరు అధికార పార్టీ నేత
- అర్ధరాత్రి వరకు అధికారులు, టీడీపీ నేత చుట్టూ ప్రదక్షిణలు

సాక్షి టాస్క్ ఫోర్స్: గూడూరు పరిధిలో లభ్యమయ్యే సిలికా నిక్షేపాల కోసం కూటమి నేతలు ఏడు నెలలుగా మైన్స్ యజమానులు, డీలర్లపై తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు చేస్తున్నారు. చిల్లకూరు, కోట మండలాల పరిధిలో 79 మైన్స్ ఉన్నాయి. వాటిని నమ్ముకుని 90 మందికిపైగా డీలర్లు ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే సిలికా తవ్వకాలు, అమ్మకాలను నిలిపివేసింది. ఆ తరువాత మైన్స్ యజమానులు, డీలర్లను పిలిపించి సిలికా కోసం బెదిరింపులు, దౌర్జన్యాలు చేశారు. చేసేది లేక మైన్స్ యజమానులు, డీలర్లు కలిసి స్థానిక అధికార పార్టీ నేత ఒకరికి భారీ మొత్తంలో నగదు సమర్పించారు. దాంతో ముందుగా డీలర్ల వద్ద ఉన్న సిలికాను విక్రయించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వారం రోజుల పాటు సిలికా అనుమతుల కోసం మైన్స్ అధికారులు లాంఛనాలన్నీ పూర్తి చేసినట్లు సమాచారం. గురువారం సాయంత్రానికి 50 మంది డీలర్లకు అనుమతులు ఇవ్వాల్సి ఉంది. వీరిలో 15 మంది డీలర్ల వద్ద సుమారు 3 లక్షల టన్నుల సిలికా నిల్వలు ఉన్నాయి. అనుమతులు ఇస్తే.. రెండు నెలల్లోనే సిలికాను విక్రయించాలి. ఆ తరువాత డీలర్ల లైసెన్సులు రద్దవుతాయి. అయితే స్థానిక అధికార పార్టీ నేత ప్రస్తుతం నిల్వ ఉన్న సిలికాను తరలించుకెళ్లాలంటే పర్సెంటేజ్ ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పారు. 'అదేంటి సార్.. మొన్న మేమంతా కలిసి డబ్బులు చెల్లించాం కదా. తప్పని పరిస్థితి అయితే.. ఉన్న సిలికాను విక్రయించగా వచ్చిన మొత్తంలో నుంచి కొంత ఇస్తాం. ప్రస్తుతం అయితే మేము ఇచ్చే పరిస్థితిలో లేము. అప్పుల పాలయ్యాము. ఉన్న సిలికాను విక్రయిస్తేన మేము గట్టెక్కుతాం' అని విన్నవించారు. 'అది అనుమతులకు మాత్రమే. ఇప్పుడు నిల్వ ఉన్న సిలికాను విక్రయిస్తే వచ్చే నగదులో నాకు పర్సెంటేజ్ ఇవ్వాల్సిందే' అని టీడీపీ నేత తేల్చిచెప్పారు. దీంతో ఏం చెయ్యాలో దిక్కుతోచక డీలర్లు రాత్రంతా అధికారులు, ఆ టీడీపీ నేత నివాసం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ కనిపించారు.

### అపరాధ రుసుము కట్టిన వారికే అనుమతులు

సిలికా డీలర్లలో గతంలో తప్పులు చేసిన వారికి అపరాధ రుసుము విధించాం. అలాంటి వారిలో కొంత మంది చెల్లించారు. ఇందులో సుమారు 50 మంది వరకు అనుమతులు ఇస్తున్నాం. వారి వద్ద ఉన్న నిల్వలను బట్టి పర్మిట్‌లు మంజూరు చేస్తున్నాం. సిలికా గనులకు అనుమతులు మంజూరుపై ఇంకా ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందలేదు. వచ్చిన వెంటనే వారికి కూడా అనుమతులు మంజూరు చేస్తాం.

– శ్రీనివాసరావు, గనులశాఖాధికారి, గూడూరు

## ఉపాధే లక్ష్యం


అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: యువతకు ఉపాధి అవకాశాలే లక్ష్యంగా శిక్షణ ఇప్పించాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా వృత్తి నైపుణ్యాభివృద్ధి కమిటీలోని అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ సంకల్ప ఫండ్ ప్రణాళికలో భాగంగా యువతను ప్రోత్సహించేలా వారికి అవసరమైన రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రధానంగా ఎస్వీ యూనివర్సిటీలో నిరుద్యోగ యువతీ యువకులకు ప్రతినెలా డ్రోన్ ట్రైనింగ్‌పై శిక్షణ ఇవ్వాలన్నారు. ఆర్ఎస్ఈటీఐ సంస్థ ఆధ్వర్యంలో నారావారిపల్లిలో యువత కోసం లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌పై శిక్షణ ఇవ్వాలని చెప్పారు. నాయుడుపేటలో పీఎంకేవీవై స్కిల్ హబ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని చెప్పారు. మరోవైపు పీఎం విశ్వకర్మలో శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులకు డీబీటీ సాయంతోపాటు టూల్ కిట్స్ అందించాలని పేర్కొన్నారు. మరోవైపు 21–24 ఏళ్ల వారికి పీఎం ఇంటర్న్ షిప్ పథకం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ కన్వీనర్, డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, పరిశ్రమల జిల్లా మేనేజర్ శ్రీరామ్‌మూర్తి, పద్మావతి, వెంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రతినిధులు విశ్వనాథ్‌రెడ్డి, సతీష్ చంద్ర, వెంకటరమణ పాల్గొన్నారు.

## రహదారి భద్రత.. మనందరి బాధ్యత


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న అడిషనల్ ఎస్పీ వెంకట్రావు, జిల్లా రవాణాశాఖ అధికారి

తిరుపతి మంగళం : రహదారి భద్రత మనందరి బాధ్యత అని జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకట్రావు, జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రిపాటి మురళీ మోహన్ అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం కరకంబాడి రోడ్డులో రవాణా, పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వాకతాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏర్పాటుచేసిన ర్యాలీని వారు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ హెల్మెట్ ధారణ, మోటారు వాహనాల నియమ నిబంధనలపై అవగాహన కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. ప్రజలకు, వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ అవగాహన ర్యాలీ కరకంబాడి రోడ్డు నుంచి లీలామహల్ సర్కిల్ మీదుగా కొనసాగింది. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి, రవాణాశాఖ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, అతికానాజ్, ఆంజనేయ ప్రసాద్, మోహన్‌కుమార్, వెంకటరమణ నాయక్, స్వర్ణలత, ప్రసాద్‌వర్మ, ఎస్వీ, అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## సేవలతోనే సంతృప్తి


సైకిళ్లు పొందిన విద్యార్థినులతో ఎస్‌బీఐ తిరుపతి రీజినల్ మేనేజర్ వెంకటేశ్వరరావు

తిరుపతి అర్బన్: సేవ చేయడంలోనే సంతృప్తి లభిస్తుందని ఎస్‌బీఐ తిరుపతి ప్రాంతీయ మేనేజర్ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం సత్యనారాయణపురంలోని జెడ్పీ హైస్కూల్‌లో పది మంది విద్యార్థినులకు కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా సైకిళ్లు పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. పేదరికంతో బాధపడుతున్నా చదువుల్లో రాణిస్తున్న విద్యార్థినులు, తండ్రులను కోల్పోయినా పట్టుదలతో చదువుతున్న వారికి సైకిళ్లు అందజేసి తమవంతు ప్రోత్సాహిస్తున్నట్టు ఆయన చెప్పారు. చదువుకు మించిన ఆస్తి మరొకటి లేదని, బాగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం సంధ్యారాణి, ఇన్‌చార్జ్ భువనేశ్వర్, టీచర్లు అశోక్, నిర్మల, ఆదిలక్ష్మి, విద్యాలత, వెంకట్రాద్రి, ఎస్‌బీఐ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రజల ఆందోళన!



వెంకటగిరి పట్టణంలోని 5వ వార్డు దొమ్మరపాళెం వాసులు గురువారం పురపాలక సంఘ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. వారం రోజులుగా తాగేందుకు మంచి నీరు రావడం లేదని మహిళలు వాపోయారు. గుక్కెడు నీటి కోసం నిత్యం పాట్లు పడుతున్నా పట్టించుకునే నాథుడు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించాలని కోరారు. – వెంకటగిరి (సైదాపురం)

## సిండికేట్ల చేతిలో.. చితికిపోతున్న రొయ్య!

- తగ్గిపోతున్న ధర
- అయోమయంలో ఆక్వా రైతులు


సాగులో ఉన్న రొయ్యల గుంతలు


రొయ్యలు విక్రయిస్తున్న రైతులు

### రొయ్యల ధరలు

| కౌంటు | ఆన్‌లైన్ ధర కిలో రూ. | జిల్లా ధర కిలో రూ. | వ్యత్యాసం రూ. |
|---|---|---|---|
| 30 | 625 | 475 | 150 |
| 40 | 550 | 415 | 135 |
| 50 | 480 | 375 | 105 |
| 60 | 460 | 345 | 115 |
| 70 | 420 | 310 | 110 |
| 80 | 390 | 290 | 100 |
| 90 | 350 | 270 | 80 |
| 100 | 320 | 260 | 60 |

వాకాడు: సిండికేట్ల చేతిలో ఆక్వారైతులు చితికిపోతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో సరైన గిట్టుబాటు ధరలేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. గతంలో రొయ్య ఉత్పత్తులు బాగా విస్తరించి ఉండేవి. అప్పట్లో విదేశీ వ్యాపారులే రైతు నుంచి రొయ్యలను కొనుగోలు చేసేవారు. కానీ నేడు సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. ఫలితంగా రొయ్య ఉత్పత్తులు పడిపోయాయి. విదేశీ వ్యాపారులు రావడం మానేశారు. ఇదే అదునుగా స్థానికులు సిండికేట్‌గా ఏర్పడి ధర తగ్గించేశారు. ఆక్వా రైతులను నిలువునా దోచుకుంటున్నారు.

### తగ్గుతున్న సాగు విస్తీర్ణం

జిల్లాలో ఆక్వా సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది. గతంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా 2.5 లక్షల హెక్టార్లలో రొయ్యలు సాగు చేసేవారు. ఏడాదికి 7.5 లక్షల టన్నుల రొయ్యలు విదేశాలకు ఎగుమతి అయ్యేవి. రైతులకు రూ.1.75 లక్షల కోట్ల వరకు ఆదాయం చేకూరేది. కానీ ప్రస్తుతం 15 వేల హెక్టార్లలోనే ఆక్వా సాగు చేస్తున్నట్టు సమాచారం. ఏడాదికి రూ.100 కోట్లు కూడా ఆదాయం రాని పరిస్థితి.

### ఆకాశాన్నంటుతున్న ఫీడ్ ధరలు

గత రెండు నెలల క్రితం రొయ్యల ఫీడ్ టన్ను రూ.75 వేలు ఉండగా ప్రస్తుతం రూ.85 వేలకు చేరింది. అలాగే విద్యుత్ చార్జీలు పెరిగిపోయాయి. గతంలో యూనిట్ రూ.1.5 పైసల నుంచి రూ.2 వరకు ఉండగా.. ఇప్పుడు రూ.2 నుంచి రూ.3 వరకు పెరిగిపోయింది. సాగుపై పెట్టిన పెట్టుబడులు కూడా చేతికందని పరిస్థితి. మరోపక్క అనుమతులు లేని హేచరీలు నాసిరకం బ్రూడర్స్ ద్వారా సీడ్‌ని ఉత్పత్తి చేసి రైతులకు కట్టబెడుతున్నారు. ఆక్వా సాగుపై భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టినా లాభాలు రాకపోవడంతో రైతులు విలవిల్లాడాల్సి వస్తోంది.

### రైతులను దోచుకుంటున్నారు



కొందరు బడా వ్యాపారులు సిండికేట్లుగా ఏర్పడి చెప్పిందే ధరగా ఆక్వా రైతులను నిలువునా దోసుకుంటున్నారు. దీంతో కనీసం పెట్టుబడులు కూడా రావడంలేదు. గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నాం.

– మధురెడ్డి, ముట్టెంబాక

### నష్టపోతున్నాం



గతంలో ఆక్వా సాగులో మంచి లాభాలు వచ్చేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కనీసం పెట్టుబడులు కూడా రావడం లేదు. అటు భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోక, ఇటు రొయ్యకు గిట్టుబాటు ధరలేక అల్లాడిపోతున్నాం.

– కృష్ణా, ఆక్వారైతు, తూపిలిపాళెం

## క్లుప్తంగా

### ఉత్తమ సేవలకు అవార్డులు


ఎస్.వెంకటేశ్వర్, కలెక్టర్


వీ.హర్షవర్ధన్ రాజు, ఎస్పీ


కేపీ భాగ్యలక్ష్మి, అర్బన్ తహసీల్దార్

**తిరుపతి అర్బన్:** 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తమ సేవలందించినందుకుగాను విజయవాడ వేదికగా ఈనెల 25న బెస్ట్ ఎలక్టరల్ ప్రాక్టీస్ అవార్డులను అందజేయనున్నారు. ఆ మేరకు చీఫ్ ఎలక్టరల్ ఆఫీసర్ వివేక్‌యాదవ్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. 15వ నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా ఈ అవార్డులను జారీచేయనున్నారు. తిరుపతి జిల్లా నుంచి కలెక్టర్ డాక్టర్ సలిజమాల వెంకటేశ్వర్(డీఈఓ), జిల్లా ఎస్పీ వీ.హర్షవర్ధన్‌రాజు, వెంకటగిరి అసెంబ్లీ పరిధి నుంచి ఈఆర్వో బీ.సుధారాణి, తిరుపతి అర్బన్ తహసీల్దార్(ఏఈఆర్వో) కేపీ భాగ్యలక్ష్మి, తిరుపతి నుంచి బీఎల్ఓ ఆర్.జ్యోతి, సత్యవేడు నుంచి ఎస్.పార్వతికి ఉత్తమ అవార్డులు దక్కాయి. ఆ మేరకు వారు శనివారం విజయవాడలో అవార్డులను పొందనున్నారు.

### కీచక తండ్రి

**తిరుపతి క్రైం :** కన్న కూతురుపై ఓ తండ్రి అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన తిరుపతి నగరంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అలిపిరి సీఐ రామకిషోర్ తెలిపిన వివరాల మేరకు.. ఆటోనగర్‌కు చెందిన దంపతులకు 16 ఏళ్ల కుమార్తె ఉంది. ఆమె శ్రీకాళహస్తిలోని ఓ ప్రభుత్వ కళాశాల హాస్టల్‌లో ఉంటూ ఇంటర్మీడియెట్ చదువుతోంది. ఇటీవల సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో బాలిక నిద్రిస్తున్న సమయంలో ఆమె తండ్రి అసభ్యకరంగా ప్రవర్తించాడు. అనంతరం సెలవులన్నీ ముగిశాక హాస్టల్లో వదిలే సమయంలో కూడా ఎవరికీ చెప్పొద్దు అంటూ బాలికకు నచ్చజెప్పి పంపాడు. అయితే అప్పటికే తల్లికి జరిగిన విషయాన్ని బాలిక చెప్పడంతో ఆమె కూడా ఏమీ తెలియనట్టుగా ఉండిపోయింది. బుధవారం ఏం జరిగిందో తెలుసుకోవడానికి ఆమె శ్రీకాళహస్తిలోని బాలిక వద్దకు వెళ్లింది. జరిగిన విషయాన్ని పూర్తిగా తెలుసుకుని కుమిలిపోయింది. అనంతరం అలిపిరి పోలీసులను సంప్రదించింది తన భర్తపై ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అలిపిరి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### భార్యపై పెట్రోల్ పోసి నిప్పు


చికిత్స పొందుతున్న ఆరీఫా

**శ్రీకాళహస్తి:** భార్యపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టిన ఘటన శ్రీకాళహస్తి పట్టణంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం.. పట్టణంలోని పెద్ద మసీదు వీధికి చెందిన పర్వేష్ మెకానిక్. అతనికి భార్య ఆరీఫా, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గురువారం మద్యం మత్తులో ఇంటి ఆవరణలో భార్య ముఖంపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు గుర్తించి మంటలను అదుపు చేశారు. చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి పర్వేష్‌ను అదుపులోకి తీసుకున్నారు.

# ఆర్టీసీ ఉద్యోగుల ఆపరేషాన్!

- ఆపరేషన్ల కోసం రేవర్ల జోరు
- నూతన ఆస్పత్రిలో శస్త్రచికిత్సల సదుపాయం కల్పించాలంటున్న ఉద్యోగులు


బస్టాండ్‌లోని ఆస్పత్రిలో రోగితో మాట్లాడుతున్న డాక్టర్ సందీప్‌కృష్ణ


అలిపిరి వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఆర్టీసీ ఆస్పత్రి భవనం

**తిరుపతి అర్బన్:** తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ప్రాంగణంలో ఆర్టీసీ ఆస్పత్రి శిథిలావస్థకు చేరింది. ఈ ఆస్పత్రి పరిధిలో 4,700 మంది ఉద్యోగులతోపాటు వారి కుటుంబ సభ్యులు, 947 మంది ఆర్టీసీ విశ్రాంతి ఉద్యోగులతోపాటు వారి కుటుంబ సభ్యులు ఆధారపడి ఉన్నారు. రోజూ 80 నుంచి 120 మంది వరకు ఓపీ వస్తోంది. అయితే ఇక్కడ శస్త్రచికిత్సలకు అవకాశం లేకపోవడంతో సంబంధిత రోగులను కడప, లేదా విజయవాడకు రెఫర్ చేస్తున్నారు. దీంతో ఉద్యోగులు అవస్థలు పడాల్సి వస్తోంది.

**సా..గుతున్న భవన నిర్మాణం**

గత ఏడాది జనవరిలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అలిపిరిలోని ఆర్టీసీ క్వార్ట్స్ వద్ద ఉన్న స్థలంలో మెరుగైన వసతులతో నూతన ఆస్పత్రి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఇద్దరు వైద్యులు ఉండేలా చర్యలు చేపట్టారు. నెలకు రూ.3 లక్షల మేరకు మందులు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అప్పటి నుంచి ఇద్దరు వైద్యులు పనిచేస్తున్నారు. అయితే ఏడాదిగా ఆస్పత్రి నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి.

**రోజూ వైద్యసేవలు**

ఆర్టీసీ ఆస్పత్రిలో నాతోపాటు సందీప్‌కుమార్ అనే డాక్టర్ పనిచేస్తున్నారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని ఆర్టీసీ ఆస్పత్రికి రోజూ 80 నుంచి 120 మంది రోగులు వస్తుంటారు. వారికి అవసరమైన వైద్యం అందిస్తున్నాం.

– గుణమాధురి, ఆర్టీసీ ఆస్పత్రి వైద్యురాలు

**మెరుగైన సౌకర్యాలు కల్పించాలి**



అలిపిరి వద్ద నిర్మిస్తున్న ఆర్టీసీ ఆస్పత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. వైద్య సేవలతోపాటు నూతన ఆస్పత్రిలోనే శస్త్రచికిత్సలు చేసేలా చర్యలు చేపట్టాలి. చిన్నపాటి ఆపరేషన్‌కు సైతం కడప లేదా విజయవాడ ఆర్టీసీ ఆస్పత్రికి పంపడం సరికాదు.

-వీ.మస్తాన్, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి

**పనులు పూర్తి చేయాలి**



ఆర్టీసీ ఉద్యోగుల కోసం నూతన ఆస్పత్రిని నిర్మించడానికి పనులు ప్రారంభించారు. ఇప్పటికీ పనులు జరుగుతూనే ఉన్నాయి. వేగవంతంగా పనులు పూర్తి చేసి నూతన ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నాం.

– లతారెడ్డి, ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకురాలు

**ఇక్కడే ఆపరేషన్లు చేయాలి**



ఆర్టీసీ ఆస్పత్రిలోనే శస్త్రచికిత్సలు కూడా చేయాలి. ఆ దిశగా అధికారులు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. ఈ వైద్యశాలపై ఆధారపడి 20 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. ఇక్కడ చిన్నపాటి వైద్యం చేసి పంపేస్తున్నారు. ఆపరేషన్ల కోసం అవస్థలు పడాల్సి వస్తోంది. ఇది కరెక్ట్ కాదు.

–రాంబాబు, ఆర్టీసీ డ్రైవర్

**ఈ ఆస్పత్రే దిక్కు**



ఆర్టీసీలో సుదీర్ఘకాలం పనిచేసి ఉద్యోగ విరమణ పొందాం. నా తోపాటు మా కుటుంబ సభ్యులకు ఆరోగ్య సమస్యలు వస్తే ముందుగా వెళ్లేది ఆర్టీసీ ఆస్పత్రికే. అయితే తిరుపతి బస్టాండ్‌లోని ఆర్టీసీ ఆస్పత్రిలో చిన్నపాటి ఆపరేషన్ చేయాలన్నా.. రూయా ఆస్పత్రికి వెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు.

– సురేంద్ర, విశ్రాంతి ఆర్టీసీ ఉద్యోగి

**త్వరలో అందుబాటులోకి**



అలిపిరి వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఆర్టీసీ ఆస్పత్రిని త్వరలో అందుబాటులోకి తీసుకు వస్తాం. కొత్త ఆస్పత్రిలో ఆపరేషన్ సౌకర్యాలు ఉంటే బాగుంటుందని ఉద్యోగులు కోరుతున్నాం. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. బస్టాండ్‌లో ఉండే ఆస్పత్రిలో ఇద్దరు వైద్యులు ఉన్నారు.

– నరసింహులు, జిల్లా ప్రజా రవాణా అధికారి

## విద్యుత్ సమస్యలపై తక్షణం స్పందించాలి


అధికారులతో సమీక్షిస్తున్న ఎస్ఈ సురేందర్ నాయుడు

**నాయుడుపేట టౌన్ :** విద్యుత్ సమస్యలపై అధికారులు తక్షణం స్పందించాలని ఏపీఎస్పీ డీసీఎల్ ఎస్ఈ సురేందర్ నాయుడు ఆదేశించారు. ఆయన గురువారం నాయుడుపేటలో నాయుడుపేట, గూడూరు డివిజన్‌లోని అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్ని విద్యుత్ సబ్ స్టేషన్లలో లోవోల్టేజీ, ఓవర్ లోడ్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైతే వెంటనే కొత్తవి ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. వచ్చే వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు పెర్కొన్నారు. పీఎం సూర్య ఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూస్తామన్నారు. విద్యుత్ సమస్యలపై 1912కు ఫోన్ చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఎఫ్ఏవో శ్రీనివాసులు, నాయుడుపేట, గూడూరు ఈఈలు శ్రీనివాసులు, నరేంద్ర రెడ్డి, ఎంఎస్‌టీ ఈఈ రవికుమార్, డీఈలు వరప్రసాద్ రెడ్డి, శేఖర్, ముని రవిచంద్ర, ఏడీలు చిన్నయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధార్థలో 'సంవిధాన్ గౌరవ్ అభియన్'


సమావేశంలో మాట్లాడుతున్న రవి

**నారాయణవనం:** స్థానిక సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు బీజేపీ నాయకులు, యువమోర్చా నాయకులు పాల్గొని ప్రసంగించారు. కళాశాల ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అఖిల భారత జనతా పార్టీ జనరల్ కార్యదర్శి రవి మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా విద్యార్థుల్లో అవగాహన పెంచి, చైతన్యం నింపడానికి రెండు నెలల పాటు సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్ అంబేడ్కర్ ముంబయి నుంచి రెండో సారి ఎమ్మెల్యేగా గెలిచి న్యాయశాఖా మంత్రిగా పనిచేశారని గుర్తుచేశారు. అప్పటి ప్రభుత్వ విధానాలు నచ్చక మంత్రి పదవికి రాజానామా చేసి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. 'ప్రతిఒక్కరికీ ఓటుతో రాజకీయ సమానత్వం' కావాలనే ఉద్దేశంతో ఓటు హక్కును అంబేడ్కర్ కల్పించారని, అయితే ఆర్థిక, సాంఘిక సమానత్వాన్ని సాధ్యం కాలేదని అన్నారు. కళాశాల చైర్మన్ అశోకరాజు మాట్లాడుతూ అంబేడ్కర్ మేథో సంపదను, ఆశయాలను నేటి తరం యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని అన్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల పార్టీ అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, దేవానంద్, టీటీడీ బోర్డ్ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, నాయకులు కోలా ఆనంద్, మునికృష్ణ, రమేష్ బాబు పాల్గొన్నారు.

## 505 మందికి వైద్యపరీక్షలు

**శ్రీసిటీ(సత్యవేడు) :** శ్రీసిటీలోని టిల్ హెల్త్‌కేర్ కంపెనీ, శ్రీసిటీ ఫౌండేషన్ సంయుక్తంగా చెరివి గ్రామంలో నిర్వహించిన మూడు రోజుల ఉచిత కంటివైద్య శిబిరంలో 505 మందికి పరీక్షలు చేశారు. టిల్‌హెల్త్‌కేర్ కార్పొరేషన్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగ నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. 242 మందికి కంటి చుక్కల మందులు, 279 మందికి కంటి అద్దాలు, 48 మందికి శుక్లం (కాటరాక్ట్) ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో టిల్ హెల్త్‌కేర్ డైరెక్టర్ అజయ్ కుమార్, ప్లాంట్ ఆపరేషన్స్ హెడ్ అరుణ్ మాంగ్లా, శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధి నిరీషా సన్నారెడ్డి , మేనేజర్ రవిచంద్ర, సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గురుస్వామి, ప్రమాదానికి గురైన ద్విచక్రవాహనం

**శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట):** రేణిగుంట–కడప రహదారి రమణ విలాస్ సర్కిల్ సమీపంలోని బ్రిడ్జిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు మృతిచెందిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. రేణిగుంట మండలం, కరకంబాడి పంచాయతీ, చెంగారెడ్డిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన గురుస్వామి (32) రేణిగుంట రైల్వే స్టేషన్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి డ్యూటీ ముగించుకొని ఇంటికి తిరిగి వెళ్లే సమయంలో రేణిగుంట–కడప రహదారి రమణా విలాస్ సర్కిల్ సమీపంలోని వంతెనపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. రేణిగుంట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం గురువారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## టీడీపీ నేతల బరితెగింపు


రోడ్లను తవ్వేసి ఆక్రమించుకున్న స్థలం

**తిరుపతి తుడా:** తిరుపతిలో టీడీపీ నేతలు చెలరేగిపోతున్నారు. అధికార మదంతో కన్నూమిన్నూ కానకుండా ప్రవరిస్తున్నారు. ఇందులో భాగంగానే ఖాదీ కాలనీ సమీపంలోని ద్వారకా నగర్ గీతాంజలి స్కూల్ పక్కన ఉన్న వివాదాస్పద స్థలాన్ని సొంతం చేసుకోవడానికి కుయుక్తులు పన్నుతున్నారు. వీధిని ఆక్రమించి రోడ్లు తవ్వేస్తున్నారు. జనం రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ తిరుపతి నగర కార్యదర్శి పాటూరు వెంకటరత్నం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

## లోకేష్ జన్మదిన వేడుకల్లో జనసేనానిని చితకబాదిన టీడీపీ నేతలు

- అడ్డుకోబోయిన అతని తల్లికి పళ్లు రాల్చారు
- రెడ్ బుక్ నేత అనుచరుల అరాచకం
- జనసేనకు పరాభవం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జనసేన కార్యకర్త మునీర్‌బాషా

**సాక్షిటాస్క్ ఫోర్స్:** అధికారంలోకి రాగానే కూటమిలో భాగస్వాములైన జనసేన, బీజేపీ నాయకులకు పలుచోట్ల అవమానాలు తప్పలేదు. తాజాగా సోమల మండలంలో గురువారం రాత్రి మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకల్లో లోకేష్ బ్యానర్లు కట్టినందుకు, కేక్ కట్ చేసే కార్యక్రమంలో పాల్గొన్నందుకు జనసేన కార్యకర్తను టీడీపీ నాయకులు చితకబాదారు. సోమల మండలం కందూరులో జనసేన కార్యకర్త మునీర్ బాషా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, లోకేష్ బ్యానర్లు వేసి జన్మదిన సంబరాల్లో పాల్గొన్నారు. దీంతో రెచ్చిపోయిన తెలుగుదేశం నాయకులు మునీర్ బాషాను 'నువ్వెవడురా రావడానికి' అంటూ చితకబాదారు.. ఈ సంఘటనను చూసిన ఆయన తల్లి బిడ్డను కొట్టడం అడ్డుకున్నారు. ఆమెను కూడా కొట్టడంతో ఆమె పళ్లు రాలిపోయాయి. వెంటనే అక్కడున్న గ్రామస్తులు పుంగనూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి చిన్నారాయల్‌కు సమాచారం అందించారు. ఆయన తన అనుచరులతో సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడు కుటుంబాన్ని పరామర్శించారు. గాయపడిన మునీర్ బాషాను, ఆయన తల్లిని, జనసేన కార్యకర్తలు నాయకులు కలిసి పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారు చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు జనసేన నేతలు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేస్తారా? లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.



## ప్రచారం ఘనం..నిధులకు ఎగనామం!

**ఆర్భాటంగా పశువుల షెడ్ల నిర్మాణం**

- సకాలంలో విడుదల కాని నిధులు
- ఆపసోపాలు పడుతున్న లబ్ధిదారులు
- కమీషన్లు తీసుకుని కన్నెత్తి చూడని కూటమి నేతలు


బిల్లులు అందక ఫ్లోరింగ్ కూడా వేయని క్యాటిల్ షెడ్‌ను సంక్రాంతి రోజున ఆరంభించిన అధికారులు, స్థానిక నాయకులు

**చిల్లకూరు:** కూటమి ప్రభుత్వం సంక్రాంతి కల్లా పూర్తి చేస్తామన్న పశువుల షెడ్ల నిర్మాణం ఆరంభ శూరత్వంగా మారింది. ఉపాధి పథకం కింద నిర్మిస్తున్న ఈ షెడ్ల ఎంపిక నుంచి నిధుల మంజూరు వరకు అంతా గందరగోళంగా మారింది. జిల్లాలోని 33 మండలాల్లో 805 పంచాయతీల్లో 1,018 పశువుల షెడ్లు మంజూరయ్యాయి. వీటిని సంక్రాంతి పండుగకంతా పూర్తిచేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. పాడి రైతులుగా ఉన్నవారు, దారిద్ర్యరేఖకు దిగువ ఉండి, ఉపాధి జాబ్ కార్డు ఉన్న వారిని గుర్తించి అలాంటి వారికి క్యాటిల్ షెడ్‌లు మంజూరు చేయాల్సి ఉంది. అయితే కూటమి నాయకులు తమకు అనుకూలంగా ఉన్న వారి పేర్లను సిఫార్సు చేసి వారికి షెడ్లు మంజూరు చేసేలా అధికారులపై ఒత్తిడి తెచ్చారు. ఆపై లబ్ధిదారుల నుంచి కొంత మొత్తాన్ని వసూలు చేసి జేబులు నింపుకున్నారు. రెండు పశువులకు అవసరమైన షెడ్ ఏర్పాటుకు రూ.1.03 లక్షలు, నాలుగు పశువులుకు రూ.1.66 లక్షలు, ఆరు పశువులకు రూ.2.07 లక్షల చొప్పున మంజూరు అవుతుందని ఊదరగొట్టారు. అయితే ఆ మొత్తం సరిపోక లబ్ధిదారులు కొంత మొత్తాన్ని ఎగేసి షెడ్లు నిర్మించుకుంటున్నారు. ఇదిలావుండగా జిల్లాల్లో అత్యల్పంగా చంద్రగిరికి ఒక షెడ్డు మాత్రమే కేటాయించగా.. అదే మండలంలోని చిన్నగొట్టిగల్లుకు 165 షెడ్లు మంజూరు చేయడం గమనార్హం.

**ఒక్కో షెడ్డే ఆరంభం**

సకాలంలో ఉపాధి నిధులు అందక సంక్రాంతి నాటికి హడావిడిగా జిల్లాలోని 33 మండలాల్లో ఒక్కో షెడ్‌ను పూర్తిచేసి ఆరంభించారు. వీటిలో కూడా పూర్తి స్థాయిలో పనులు చేయలేదు. అయితే కూటమి నేతలు సంక్రాంతికొచ్చే చుట్టాల నుంచి మెప్పు పొందేందుకు శిలాఫలకాలు కలర్‌ఫుల్‌గా నింపేశారు. అప్పూసప్పు చేసి షెడ్లు నిర్మించుకుంటే.. ఇలాంటి తప్పుడు ప్రచారాలకు కొదవలేదని పలువురు దుమ్మెత్తి పోస్తున్నారు. ఇంకా ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో నిధులు రాక తెచ్చిపెట్టిన సొమ్ముకు వడ్డీకట్టుకుంటున్నా.. మొత్తం నిధులు మంజూరు చేసినట్టు శిలాఫలకాలు వేయడంపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఇదిలావుండగా జీఎస్టీ పేరుతో ఒక్కో లబ్ధిదారు నుంచి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు గుంజుతున్నట్టు తెలుస్తోంది.

**పారదర్శకంగా మంజూరు చేస్తున్నాం**

క్యాటిల్ షెడ్లు మంజూరులో లబ్ధిదారుల ఎంపిక నుంచి బిల్లుల చెల్లింపు వరకు ప్రతి ఒక్కటీ పారదర్శకంగా ఉండేలా చూస్తున్నాం. పనులు పూర్తయిన వారికి మాత్రమే బిల్లులు విడుదల చేస్తున్నాం. అలాగే మూడు విడతల్లో బిల్లులు అందిస్తున్నాం. సంక్రాంతి రోజు ఆరంభించిన ప్రతి షెడ్‌లో ఇంకా కొన్ని పనులు పూర్తి చేయాల్సి ఉంది. వాటిని పూర్తి చేసిన అనంతరమే ఫైనల్ బిల్లు మంజూరు చేస్తాం.

– శ్రీనివాసప్రసాద్, డ్వామా పీడీ

## రూ.20 లక్షలకు టోకరా

**పెళ్లకూరు:** మండలంలోని అర్ధమాల గ్రామానికి చెందిన మద్దాల వంశీకృష్ణ అనే యువకుడు ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్‌లో రూ.20 లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ మేరకు గురువారం పోలీసులను ఆశ్రయించాడు. పోలీసుల సమాచారం మేరకు గ్రామానికి చెందిన వంశీకృష్ణ డిసెంబర్‌లో ఓ ఆన్‌లైన్ యాప్ ద్వారా నగదు ఇన్వెస్ట్‌మెంట్ చేశాడు. తద్వారా లక్షల్లో అమౌంట్ క్రెడిట్ అయినట్టు ఫోన్‌కు మెసేజ్‌లు రావడం, అప్పుడప్పుడూ తక్కువ మొత్తంలో డిబెట్ కావడం జరుగుతుండేది. ఈ క్రమంలో ఒక్కసారిగా రూ.50 లక్షలు క్రెడిట్ అయినట్టు వంశీకృష్ణ ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దాంతో వెంటనే రూ.50 లక్షలు ఒకేసారి డ్రా చేసేలా లాగిన్ కావడం వల్ల మొత్తం నిల్ బ్యాలెన్స్ చూపించింది. ఈవిషయమై సంబంధిత నంబర్‌ను కాంటాక్ట్ కావడంతో ఒక్కసారిగా రూ.50 లక్షలు డ్రా చేయకూడదని, ఒక్కొక్కసారి రూ.3 లక్షలు చొప్పున మాత్రమే డ్రా చేసుకోవాలని సూచించారు. అయితే మళ్లీ వీఐపీ చానల్‌లో రూ.10 లక్షలు ఇన్వెస్ట్‌మెంట్ చేస్తేనే ఆన్‌లైన్‌లో కొనసాగే అవకాశం ఉంటుందని సూచించారు. ఇలా మొత్తం రూ.20 లక్షలు ఇన్వెస్ట్‌మెంట్ చేశాక ఫోన్ నంబర్ అందుబాటులో లేకుండా పోయింది. దాంతో బాధితుడు వారం కిందట తిరుపతి సైబర్‌క్రైం అధికారులను కలిసి ఫిర్యాదు చేశాడు. ఉన్నతాధికారుల సూచనల మేరకు పెళ్లకూరు పోలీసులను కలిసి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

**శ్రీకాళహస్తి:** గుర్తు తెలియని వ్యక్తి (60) రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసుల కథనం.. శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని మృతుని వివరాల కోసం ఆరా తీయగా.. ఏమీ లభించలేదు. అనంతరం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. వివరాలు తెలిస్తే రైల్వే పోలీసులను సంప్రదించాలని వారు సూచించారు.

### భార్య కాపురానికి రాలేదని!

**– ఉరివేసుకుని వ్యక్తి మృతి**


మృతి చెందిన మునిశేఖర్

**దొరవారిసత్రం:** కుటుంబంలో ఏర్పడిన వివాదాల వల్ల భార్యాబిడ్డలు దూరం కావడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఉరివేసుకుని తనువు చాలించిన ఘటన శ్రీధనమల్లి గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకోగా గురువారం వెలుగులోకి వచ్చింది. స్థానిక పోలీసులు, గ్రామస్తుల కథనం.. శ్రీధనమల్లి గ్రామానికి చెందిన మునిశేఖర్(28) భార్య హరిత మధ్య గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అతని భార్య ఇద్దరు పిల్లలను తీసుకుని ఆరు నెలలు కిందట బుచ్చినాయుడుకండ్రిగ మండలం కాటూరు గ్రామంలోని అమ్మగారి ఇంటికి వెళ్లిపోయింది. తిరిగి రావాలని పలు మార్లు భార్యను పిలిచినా రాకపోవడంతో మనస్తాపానికి గురైన మునిశేఖర్ బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి గురువారం వెళ్లి పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు.